రైతు బజార్ ఆధునికీకరణకు కృషి: ఎమ్మెల్యే



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితా ఇంద్రారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్ ఆధునికీకరణకు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం రైతుబజార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 1994–95 లో ఏర్పాటు చేసిన నిర్మాణం కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, షెడ్డు నిర్మాణాన్ని కొంచం ఎత్తు పెంచి గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడు బండి వ్యాపారులకు రైతు బజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్‌లో రైతులకు నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం బీజేఆర్ భవనాన్ని పరిశీలించి అత్యాధునిక వసతులతో ఆధునీకరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారిణి కుసుమ లావణ్యకు సూచించారు. బీజేఆర్ భవన్‌లో వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఆధునీకరణ కోసం రూ. 4 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈఓ స్రవంతి రెడ్డి, డీఈ రవీందర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, యూత్ వింగ్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నర్సింహాగౌడ్, నాయకులు అరవింద్, పెండ్యాల నగేష్, సాజిద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఊర్మిలరెడ్డి, శ్యామ్‌గుప్తా, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, కంచర్ల శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహన మెకానిక్‌లను ఆదుకోవాలి

సైదాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాహనాల మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు. బుధవారం అంతర్జాతీయ మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో అసోసియేషన్ వారికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజి నరేందర్ యాదవ్, గౌరవాధ్యక్షుడు ఎం.ముకుందారెడ్డి, ఉపాధ్యక్షుడు కె.సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శి బీరప్ప యాదవ్ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బైరామల్‌గూడ చెరువు వద్ద అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లవారు జామున ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి హస్తినాపురంలోని సాయిప్రకాశ్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీ జకియా సుల్తానా, అధికారులు అశోక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, నాయకులు రమావత్ శ్రీనివాస్‌నాయక్, గోదల రఘుమారెడ్డి, రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్, రాజశేఖర్, హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

చంపాపేట: మురుగు కూపంగా మారిన బైరామల్‌గూడ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సర్కిల్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా చంపాపేట డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువును జోనల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. చెరువు సమీపంలోని మురుగు నీటి కాలువలో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగు నీరు నేరుగా చెరువులో కలుస్తుందని, దీని వల్ల చెరువు మురుగు కూపంగా మారిందన్నారు. ఆ చెత్తను తొలగించేందుకు ఒక వ్యక్తిని తక్షణమే నియమించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే చెరువు సమీపంలోని సాయి ప్రకాష్‌నగర్ కాలనీలో పర్యటించారు. రహదారి మరమ్మతులను పూర్తి చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, అధికారులు అశోక్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, సత్యంచారి, రఘుమారెడ్డి, కాలనీవాసులు రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్, రాజశేఖర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. పూజారులు ఘన స్వాగతం పలికారు. సుధీర్‌రెడ్డి తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను స్వామివారి వద్ద పెట్టి పూజలు చేశారు. బాలు నాయక్, నల్లా రఘుమారెడ్డి, మధుసాగర్, సురేష్‌గౌడ్, యాదగిరి, శ్రీనివాస్‌యాదవ్, కిరణ్, ఈఓ శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) కింది విధంగా ఉన్నాయి. వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 70, కాకర 45, బీర 35, క్యాబేజి 35, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 35, దొండ 18, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలు 37, దోస 25, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 37. గమనిక: ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చట్టంలో మార్పు పట్ల హర్షం

చాదర్‌ఘాట్: కేంద్ర ప్రభుత్వం న్యాయ పోలీస్ శాఖ చట్టంలో దివ్యాంగులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణల పట్ల డ్వాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మలక్‌పేటలోని జాతీయ దివ్యాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ.. అంధులు, ఇతర దివ్యాంగులపై ఎవరైనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. పోలీసులే స్వయంగా అంధులు, దివ్యాంగుల ఇండ్లకు వెళ్లే విధంగా చట్టంలో కేంద్రం మార్పు తీసుకురావటం అభినందనీయమన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేసుకోకుండా ఉండాలన్నారు.

అబాకస్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు



మెడల్స్ సాధించిన విద్యార్థులతో నిర్వాహకురాలు మాధవి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ సిప్ అబాకస్‌కి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని సంస్థ నిర్వాహకురాలు మాధవి తెలిపారు. బుధవారం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల శంషాబాద్‌లో క్లాసిక్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన అబాకస్ పోటీలో తమ సంస్థకు చెందిన 27 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు.

బోనాల ఏర్పాట్లు చేయండి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: బోనాల ఉత్సవాల సందర్భంగా డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కార్పొరేటర్ హార్టీకల్చర్, శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫలహారం బండ్లు, ఘటాల ఊరేగింపులకు ఆటంకాలు కలుగకుండా కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉండే చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. ఆలయాల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ యమున, సూపర్‌వైజర్లు రవి, మహేష్, ఏఎంఓహెచ్ వెంకట్‌రాజ్, ఎస్ఎస్ గోవింద్, నాగరాజు పాల్గొన్నారు

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోం

చంపాపేట: కాలనీ సుందరీకరణ పేరుతో అంతర్గత రహదారులను ఇష్టారాజ్యంగా తవ్వి కాలనీ వాసులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో బుధవారం పర్యటించి తవ్వి వదిలేసిన కాలనీ రహదాలను పరిశీలించారు. పనులను అసంపూర్తిగా వదిలివేయవద్దన్నారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, శ్యామ్, శరత్ కుమార్, కృష్ణ, మధు, కరుణాకర్, వికాస్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, కళాచైతన్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న కారొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి



జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: బీగ్‌బజార్ నుంచి సుష్మా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పర్యటనలో భాగంగా జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కలిసి ట్రాఫిక్ సమస్య తీవ్రతపై వివరించారు. పెరుగుతున్న కాలనీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో వాహనాల రద్దీ పెరిగి రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వివరించారు. అదే విధంగా నష్టపరిహారం త్వరగా చెల్లిస్తే విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టవచ్చని జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ శివగంగా కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పాడైపోయి నిరంతరం రోడ్లపైన వ్యర్థాలు పొంగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. బుధవారం కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్ల మరమ్మతులు, చెత్త డంపింగ్ పా యింట్‌లను కూడా తీయించాలని కోరారు. వెంటనే కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, సుబ్బారావు, అవినాష్ గౌడ్ పాల్గొన్నారు.

తప్పిన కరెంటు కష్టాలు !

ఉప్పల్: చిలుకానగర్ మార్కండేయ స్వామి ఆలయం బస్తీవాసులకు కరెంటు కష్టాలు తప్పాయి. సమస్యను కార్పొరేటర్ గీత ప్రవీణ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురాగా.. విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు అమర్చడంతో బస్తీ వాసులు ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న టీటీఐ సిబ్బంది

నాగోలు: చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏఎస్‌ఐ సోమనాథ్ అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్‌ను ఓ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ట్రాఫిక్ శిక్షణ పార్క్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, సూచనలు, నమూనాలు, రంగు రంగుల చిత్రాల సైన్ బోర్డుల గురించి విద్యార్థులకు వివరించారు. చిత్రాలతో పిల్లలను ఆకట్టుకునేలా వాహన ప్రయాణంపై జాగ్రత్తలను తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పుస్తకాలు, కరప్రతాల ద్వారా అవగాహన కల్పించారు. టీటీఐ సిబ్బంది రమేష్, సాదిక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణ

నాగోలు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరుతో ఒక మొక్కను నాటారు). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లిని మనమంతా ప్రేమిస్తామని, ఆమెకు గుర్తుగా లేదా గౌరవార్థంగా ఒక మొక్కను నాటాలని ఆమె కోరారు.

ప్రాణహిత ఆస్పత్రికి అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రాణహిత ఆస్పత్రి వైద్యులు

చైతన్యపురి: చైతన్యపురిలోని ప్రాణహిత హాస్పిటల్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషన్ అవార్డు–2024 దక్కింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు హార్దీప్ సింగ్, శ్రీపద్ నాయక్, ఎస్పీ సింగ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సమక్షంలో బాలీవుడ్ నటి హేమమాలిని చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు డాక్టర్ రాహుల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ అవార్డు రావటం ద్వారా వైద్యం పట్ల మరింత బాధ్యత పెంచిందన్నారు. అత్యాధునిక, నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవటమే కాకుండా పేద ప్రజలకు తక్కువ ఫీజులకే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు అనిల్‌కుమార్, కృష్ణ, ప్రీతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ప్రత్యేక ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయాలి



జోనల్ కమిషనర్‌తో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

చంపాపేట: బైరామల్‌గూడ చెరువులో మురుగు నీరు చేరకుండా ప్రత్యేక ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. జోనల్ కమిషనర్‌తో కలిసి అసంపూర్తి సుందరీకరణ పనుల వల్ల మురుగు, దుర్గంధంతో కూడిన చెరువును బుధవారం పరిశీలించారు. సాగర్‌రింగ్ రోడ్డు నుంచి ఎల్‌బీనగర్ మీదుగా మూసీ వరకు మురుగు నీటి ట్రంక్ లైన్ ఏర్పాటు అవసరం ఉందన్నారు. చంపాపేట చౌరస్తాలోని డీమార్టు నుంచి రెడ్డి కాలనీ మీదుగా ఎస్ఎన్‌డీపీ నిధులతో వరదనీటి కాలువ పనులను ప్రారంభించాలని కోరారు.

7న దండోర రజతోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మలక్‌పేట: నగరంలోని రవీంద్రభారతిలో ఈనెల 7న జరిగే దండోర రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ అన్నారు. మూసారంబాగ్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి రజతోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణే అంతిమ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాలుగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. వర్గీకరణపై పాలకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మలక్‌పేట నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో మాదిగ, మాదిగ ఉపకులాలను ఉత్సవాలకు తరలించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇమ్మడి నాగయ్య, బట్టు రామకృష్ణ, సోమయ్య, మహిళలు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్!

సైదాబాద్: బాలిక కిడ్నాప్‌కు గురైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నేర న్యాయచట్టం కింద సైదాబాద్ పీఎస్‌లో తొలి కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. విష్ణునగర్‌లో నివసించే స్వీపర్ యాదమ్మ కూతురు గుండు లహరి (16) సోమవారం ఇంటి బయట బట్టలు ఆరేయడం కోసం వెళ్లి తిరిగి రాలేదు. తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రెండు నెలల క్రితం కూడా బాలిక ఇలానే బయటకు వెళ్లి రాకపోతే తల్లి పోలీసులను ఆశ్రయించింది. అప్పుడు పోలీసులు బాలికను వెతికి తల్లికి అప్పగించారు. ఇప్పుడు కూడా రాజు అనే వ్యక్తి తమ కూతురిని తీసుకెళ్లి ఉంటాడనే అనుమానంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు భారత న్యాయ సంహిత (బీఎస్ఎస్) 137(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్‌పై దాడి ఘటనలో కేసు నమోదు

నాగోలు: డాక్టర్‌పై దాడి చేసిన ఘటనలో 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం. హయత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కల్యాణ్(26) గత నెల 30వ తేదీన కామెర్ల వ్యాధి చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని హెల్త్ కేర్ దవాఖానలో చేరాడు. పరీక్షల అనంతరం తల్లి అనుమతి తీసుకుని అతడిని ఐసీయూకు తరలించారు. ఈ నెల 2వ తేదీన రాత్రి చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో అతడు మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు హాస్పిటల్ చేరుకుని డాక్టర్ల నిర్లక్ష్యంతోనే కల్యాణ్ మృతి చెందాడని ఆందోళనకు దిగారు. ఐసీయూలోకి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి డాక్టర్ పరిపూర్ణాచారిపై, సిబ్బందిపై దాడి చేశారు. డాక్టర్ ఫిర్యాదుతో ఎల్‌బీనగర్ పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు 30 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలాలు శుభ్రంగా ఉండేలా చూడాలి



నాలా పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: మురికి కాలువలు, నాలాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని వీవీనగర్ శ్రీరామకృష్ణ శారదా విద్యాలయం వద్ద నాలా పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ నాలాలు, మురికి కాలువలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ కవర్లు తొలగిస్తే ముంపు సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. నాలాల్లో తొలగించిన వ్యర్థాలను రహదారులపై వేయకుండా ఉండాలని సూచించారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిద్ధు, షేక్ ఉమర్, సతీష్‌రెడ్డి, రఘునందన్, జోషి, టింకు, రాము తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మీర్‌పేట: బడంగ్‌పేట సప్తగిరి కాలనీలో గణేశ్ ఉత్సవ మండపాన్ని తొలగించిన కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి రావి నూతల శశిధర్‌రావు, బీజేపీ నాయకులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శశిధర్‌రావు మాట్లాడుతూ.. కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులందరి ఆమోదంతో దాదాపు రూ.10లక్షల వ్యయంతో గణేశ్ మండపాన్ని నిర్మించామన్నారు. ఇటీవల బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులు మండపాన్ని తొలగించడంతో పాటు హిందూ దేవతామూర్తుల చిత్రపటాలను సైతం జేసీబీతో తొలగించి మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజును కోరారు.

నరికిన కొమ్మలు తొలగించరా?

- విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత
- తొలగించకుండా ఎక్కడికొమ్మలు అక్కడే..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసుల ఆగ్రహం



నాగోలు అరుణోదయనగర్ కాలనీలోని నరికిన చెట్ల కొమ్మలు



మరో కాలనీలో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు

నాగోలు: విద్యుత్ వైర్లకు అడ్డంగా చెట్లు కొమ్మలు పెరిగిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు కొమ్మలను తొలగించారు. కానీ వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కాలనీలో పెద్ద ఎత్తున ఎండిపోయిన చెట్ల కొమ్మలు ఉండటంతో వర్షం వచ్చినప్పుడు అక్కడ చెత్తాచెదారం పేరుకుపోతుంది. చెత్త కుప్పలతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. పన్నులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై అధికారులకు లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొమ్మలు పేరుకుపోయిన ప్రాంతాలు

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్ పరిధిలో అరుణోదయనగర్, అనంతుల కాలనీ, గణేష్‌నగర్, విజయగార్డెన్, రాఘవేంద్రకాలనీ, సాయినగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మారుతీనగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, మోహన్‌నగర్, బాలాజీనగర్, సత్యనగర్, సమతపూరి, న్యూనాగోలు, స్నేహపురి కాలనీల పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలను తొలగించారు. వాటిని అక్కడి నుంచి తీయకపోవడంతో కుప్పలుగా పేరుకుపోయాయి. దానికి తోడు వివిధ కాలనీలో చెత్తాచెదారం వేయడంతో ఆ ప్రాంతం పూర్తిగా దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో క్రిమికీటకాలు వ్యాప్తి చెందుతున్నాయి. చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్యం విభాగం అధికారులు స్పందించి పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

మలక్‌పేట: దేశంలో విద్యారంగం పట్ల మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం కేజీ టూ పీజీ వరకు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ పిలుపునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లో బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు భరోసా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో షేక్ మహమూద్, అనిల్‌కుమార్, వంశీ, రాహుల్, దశరథ, అంజి పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి..

మన్సూరాబాద్: నీట్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి అన్నారు. విద్యాసంస్థల బంద్ వాల్ పోస్టర్‌ను హయత్‌నగర్‌లో ఆవిష్కరించారు. అరుణ్‌కుమార్‌గౌడ్, వెంకటేష్, బన్నీ, ఉపేందర్, వరుణ్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

బంద్‌లో భాగస్వాములవ్వాలి

హస్తినాపురం: విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వాములవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ ఎల్‌బీనగర్ డివిజన్ అధ్యక్షుడు కానుగుల అరుణ్, డివిజన్ కమిటీ సభ్యులు నరేశ్, పవన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.